

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ నాయకులు, రైతులతో చర్చిస్తున్న ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు సతీశ్‌కుమార్, సుదర్శన్‌రెడ్డి

## రజతోత్సవ సభాస్థలి పరిశీలన

- **రైతులతో చర్చించిన బీఆర్ఎస్ నాయకులు**
- **సభ నిర్వహణకు స్వచ్ఛందంగా భూములిచ్చిన రైతులు**

ఎల్కతుర్తి, మార్చి 27: బీఆర్ఎస్ రజతోత్సవ సభ స్థలం కోసం గురువారం ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు వొడితల సతీశ్‌కుమార్, పెద్ది సుదర్శన్‌రెడ్డి రైతులతో చర్చించారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల నాయకుల నుంచి వివరాలు సేకరించారు. డ్రోన్ కెమెరా ద్వారా మ్యాపింగ్‌ను తీసుకున్నారు. సభ నిర్వహణ కోసం రైతులు స్వచ్ఛందంగా భూములను ఇచ్చేందుకు సంసిద్ధత వ్యక్తంచేయగా, వారి నుంచి ఎన్‌వోసీ తీసుకున్నారు. 1200 ఎకరాల వరకు మీటింగ్ హాల్, వాహనాల పార్కింగ్‌కు అవసరం ఉన్నట్టు గుర్తించారు. 800 ఎకరాలకు పైగా స్థలాన్ని ఇప్పటికే సేకరించారు. సభ ఎక్కడ జరిగేది బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌తో చర్చించాకే తుదినిర్ణయం తీసుకోనున్నట్టు సమాచారం.

## వేములవాడ రైతులకు న్యాయం చేయాలి

### కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ఎంపీ వద్దిరాజు వినతి

హిమాయత్ నగర్, మార్చి 27: సిరిసిల్ల జిల్లా వేములవాడ బైపాస్ రోడ్డుకు సమీపాన ప్రతిపాదిత రైలుమార్గంలో భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం చెల్లించి న్యాయం చేయాలని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. వేములవాడకు నిత్యం పెద్ద సంఖ్యలో భక్తులు వస్తున్న నేపథ్యంలో కొత్త రైల్వేస్టేషన్, బస్టాండ్ నిర్మాణానికి ప్రతిపాదించినట్టు చెప్పారు. దీని కోసం పదేండ్ల క్రితమే భూ సేకరణ జరిగిందని. ఈ క్రమంలో పంటలు వేయలేక,



క్రయవిక్రయాలు జరగక 300 కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వాహనాల పార్కింగ్ కోసం గుడికి సమీపాన ఉన్న చెరువు పక్క భూములను గతంలో ప్రభుత్వం సేకరించి ఎకరాకు రూ. 94 లక్షల చొప్పున పరిహారం చెల్లిందని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి వేములవాడను సందర్శించిన సందర్భంలో భూములు కోల్పోయిన వారికి గతంలో కంటే మూడు రెట్లు పెంచి పరిహారం అందిస్తామని ఇచ్చిన హామీ కార్యరూపం దాల్చకపోవడంతో రైతులు ఆందోళనలో ఉన్నారని పేర్కొన్నారు. భూముల మార్కెట్ ధర ఎకరాకు రూ. 3 కోట్లు ఉందని, ఆ విధంగా పరిహారం అందించి న్యాయం చేయాల్సిందిగా బాధిత రైతుల పక్షాన ఎంపీ రైల్వే మంత్రిని కోరారు. ఎంపీ వినతిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు.

### రైల్వేలో జర్నలిస్టుల రాయితీని పునరుద్ధరించాలి: వద్దిరాజు

హైదరాబాద్, మార్చి 27 (నమస్తే తెలంగాణ): రైల్వేలో జర్నలిస్టుల రాయితీని పునరుద్ధరించాలని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. గురువారం రాజ్యసభలో ఆయన ప్రసంగించారు. కోవిడ్ కారణంగా ఎత్తేసిన రాయితీ పథకాన్ని పునఃప్రారంభించాలని కోరారు. జర్నలిస్టుల రాయితీ పథకంపై రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ దృష్టికి కూడా తీసుకెళ్లారు. ఈ మేరకు కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారన్నారు.



హనుమకొండ జిల్లా ధర్మసాగర్ రిజర్వాయర్‌లోకి మూడో పంప్‌హౌజ్ నుంచి దుంకుతున్న గోదావరి జలాలు

# నీళ్లకు కేసీఆర్ ప్రాజెక్టే దిక్కు

- **బీఆర్ఎస్ హయాంలోనే పంప్‌హౌజ్ నిర్మాణం పూర్తి**
- **ఎట్టకేలకు దేవన్నపేట మోటర్లు షురూ**
- **ధర్మసాగర్ రిజర్వాయర్‌కు దేవాదుల నీరు**
- **మళ్లీ లాంఛనంగా ప్రారంభించిన మంత్రులు ఉత్తమ్, పొంగులేటి**

వరంగల్, మార్చి 27(నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఎట్టకేలకు దేవన్నపేట పంపుహౌజ్ మోటర్లు గురువారం ప్రారంభమయ్యాయి. ధర్మసాగర్ రిజర్వాయర్‌కు నీళ్లు చేరుతున్నాయి. గోదావరిలో పుష్కలంగా నీళ్లు ఉన్నా సాగునీటి నిర్వహణలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం యాసంగి పంటలకు నీరిచ్చేందుకు అపసోపాలు పడుతున్నది. దేవాదుల ప్రాజెక్టు మూడో దశలో దేవన్నపేట పంపుహౌజ్‌లో 10 రోజులుగా అనేక ప్రయత్నాల అనంతరం ఒక మోటర్ ఆన్ అయ్యింది. తెలంగాణలో ప్రతి ఎకరాకు సాగునీరు అందించే లక్ష్యంగా కేసీఆర్ ప్రభుత్వం దేవాదుల ప్రాజెక్టును పూర్తి చేసింది. దేవాదుల ప్రాజెక్టు రెండు దశల్లోని పంపింగ్‌తో రిజర్వాయర్ నిండేందుకు నెలరోజులు పట్టేది. మూడోదశలోని దేవన్నపేట పంపుహౌజ్‌తో వారంలోనే ధర్మసాగర్ రిజర్వాయర్ నింపే అవకాశం ఉంటుంది. బీఆర్ఎస్ ఒత్తిడితో దేవాదుల పరిధిలోని యాసంగిలో పంటలను కాపాడేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చివరిదశలో ఆలోచించింది.

### రెండోసారి వచ్చిన మంత్రులు

సాగునీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వరంగల్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఈ నెల 18న దేవన్నపేట పంపుహౌజ్ వద్దకు వచ్చి మోటర్లను ఆన్ చేసేందుకు ప్రయత్నించారు. నిర్వహణ లేమితో ఆ రోజు పంపులు ఆన్‌కాలేదు. ఆస్ట్రియా కంపెనీ ఇంజినీర్లు వచ్చి పరిశీలించిన అనంతరం గురువారం పంపింగ్ మొదలైంది. అధికారుల సమాచారం మేరకు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి వచ్చి ఒక మోటరును ఆన్‌చేయగా ధర్మసాగర్ రిజర్వాయర్‌కు నీళ్లు చేరుతున్నాయి.

### మూడో దశ మొత్తం పూర్తిచేస్తాం: ఉత్తమ్

యాసంగి పంటలకు సాగునీరు అందించే లక్ష్యంతోనే దేవాదుల ప్రాజెక్టు మూడో దశలో పంపింగ్ చేపట్టినట్టు సాగునీటి మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. దేవన్నపేట పంపుహౌజ్‌లోని మోటర్‌ను ఆన్ చేసిన అనంతరం ధర్మసాగర్ రిజర్వాయర్‌ను సందర్శించి నీటి విడుదలను పరిశీలించారు. గోదావరి జలాలకు ప్రత్యేక పూజలు చేశారు. దేవాదుల ప్రాజెక్టు పరిధిలోని మూడు దశల పనులను పూర్తిచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని చెప్పారు. దేవన్నపేట పంపుహౌజ్‌లో మూడు మోటర్లు ఉన్నాయని, ఒక్క పంపుతో 650 క్యూసెక్కుల నీరు పంపింగ్ అవుతుందని తెలిపారు. స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి, జనగామ, వర్ధన్నపేట నియోజకవర్గాల్లోని పంటలకు సాగునీరు అందుతుందని చెప్పారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ 15 రోజుల క్రితమే పంపులు ఆన్ చేయాల్సి ఉన్నదని, ఆలస్యం కావడంతో 50 నుంచి 100 ఎకరాల్లో వరి పంట ఎండి నష్టం వాటిల్లినట్టు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, యశస్విని‌రెడ్డి, కేఆర్ నాగరాజు, వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి అధికారులు పాల్గొన్నారు.

### కేసీఆర్ హయాంలో నిర్మాణం

*దేవాదుల ప్రాజెక్టు పనులు ఉమ్మడి రాష్ట్రంలోనే మొదలయ్యాయి. 2001 నుంచి 2014 వరకు సమైక్య ప్రభుత్వాలు పట్టించుకోలేదు. కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక దేవాదుల ప్రాజెక్టు పనులు పూర్తయ్యాయి. వరంగల్, హనుమకొండ, కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, జనగామ, సిద్దిపేట, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లోని 5.57లక్షల ఎకరాలకు రెండు పంటలకు సాగునీరు అందించేలా కేసీఆర్ దేవాదుల ప్రాజెక్టును చేపట్టారు. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం గంగారం వద్ద గోదావరి నదిలోని దేవాదుల ప్రాజెక్టు పంపుహౌజ్ నుంచి మూడు మార్గాల్లో హనుమకొండ జిల్లా ధర్మసాగర్‌కు పంపింగ్ జరిగేలా మార్పులు చేశారు. అప్పటివరకు ఏడాదిలో రెండు నెలలు మాత్రమే గోదావరి నుంచి నీరు ఎత్తిపోతలకు అవకాశం ఉండేది. దేవాదుల పంపుహౌజ్‌కు దిగువన కేసీఆర్ ప్రభుత్వం నిర్మించిన సమ్మక్క బరాజ్‌తో ఏడాది పొడవునా పంపింగ్‌కు నీరు అందుబాటులోకి వచ్చింది.*

## సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీయడం తగదు

- **జనాభా ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన చేయడం సరికాదు**
- **రాష్ట్రాల్లో శాసనసభ సీట్లను పెంచాలి**
- **కొత్త పార్లమెంట్ సామర్థ్యం పెంపుతో డీలిమిటేషన్ చర్చకు ఊతం**
- **మాజీ ఎంపీ వినోద్ కుమార్**

హైదరాబాద్, మార్చి 27 (నమస్తే తెలంగాణ): జనాభా ఆధారంగా డీలిమిటేషన్ చేపట్టడం సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీస్తుందని, ఇది తగదని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ తెలిపారు. తమిళనాడు సీఎం స్టాలిన్ ఆధ్వర్యంలో డీలిమిటేషన్‌పై నిర్వహించిన సదస్సులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తోపాటు పాల్గొని తెలంగాణ అభిప్రాయాలను వెల్లడించినట్టు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలపై పడే ప్రభావాన్ని ఈ సదస్సులో వివరించామని పేర్కొన్నారు. కొత్త పార్లమెంట్ భవనంలో లోక్‌సభలో సీటింగ్ సామర్థ్యాన్ని 888 స్థానాలకు, రాజ్యసభలో 384 స్థానాలకు పెంచడం డీలిమిటేషన్‌పై జరుగుతున్న చర్చకు మరింత బలం చేకూరుస్తున్నదని తెలిపారు. డీలిమిటేషన్‌పై దక్షిణాది రాష్ట్రాల్లో తీవ్ర ఆందోళన నెలకొన్నదని స్పష్టం చేశారు. దీనిపై రాజకీయ వర్గాల్లో సుదీర్ఘ చర్చలు జరుగుతున్నాయని వెల్లడించారు. చెన్నై సమావేశంలో రాష్ట్రాల్లో శాసనసభ సీట్ల సంఖ్యను పెంచాల్సి ఉందని బీఆర్ఎస్ తరపున సూచించినట్టు పేర్కొన్నారు. ఎమ్మెల్యేల ప్రాతినిధ్యాన్ని విస్తరించడం వల్ల పరిపాలన మెరుగవుతుందని సూచించామని తెలిపారు.



### గతంలో డీలిమిటేషన్ ఇలా..

జనగణన ప్రకారం దేశంలో డీలిమిటేషన్ ప్రక్రియను గతంలో ప్రవేశపెట్టారని వినోద్‌కుమార్ తెలిపారు. స్వాతంత్ర్యం తర్వాత 1951లో జనాభా లెక్కల ఆధారంగా మొదటిసారిగా డీలిమిటేషన్ కసరత్తు జరిగినట్టు వెల్లడించారు. 1961 జనాభా లెక్కల ఆధారంగా రెండోసారి డీలిమిటేషన్ జరిగిందని తెలిపారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో పార్లమెంట్ సీట్ల సంఖ్యను 494 నుంచి 522కి, అసెంబ్లీ సీట్ల సంఖ్యను 3,771కి పెంచినట్టు వెల్లడించారు. 1971 జనాభా లెక్కల ఆధారంగా 1973లో మూడోసారి డీలిమిటేషన్ జరిగిందని పేర్కొన్నారు. దీంతో ఎంపీ స్థానాల సంఖ్య 522 నుంచి 543కు పెరిగినట్టు తెలిపారు. అసెంబ్లీ స్థానాలు 3,771 నుంచి 3,997 పెరిగినట్టు చెప్పారు.

## ప్రజాపాలన కాదు.. ప్రజల ఆశల అవహేళన

- **సీఎం రేవంత్‌రెడ్డికి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధం**
- **మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి**

హైదరాబాద్, మార్చి 27 (నమస్తేతెలంగాణ): రాష్ట్రంలో కొనసాగుతున్నది ప్రజాపాలన కాదని, ప్రజల ఆశల అవహేళన అని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీలన్నీ అటకెక్కించి, ప్రజాసంపదను కొల్లగొడుతున్నారని ఆరోపించారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో రూ. 28,817 కోట్లు రుణమాఫీ చేశామని, 11 విడుతల్లో రూ. 73 వేల కోట్లు రైతుబంధు ఇచ్చామని, 1.11 లక్షల మంది రైతు కుటుంబాలకు రూ. 5లక్షల చొప్పున బీమా అందజేశామని తెలిపారు. రేవంత్‌రెడ్డి మాత్రం 'నవ్విపోదురుగాక నాకేంటి సిగ్గు' అన్న చందంగా రైతులకు 3 గంటల కరెంట్ చాలు అని, 10 హెచ్‌పీ మోటర్ పెడితే గంటలో ఎకరాకు నీరందిచ్చవచ్చని మాట్లాడారని గుర్తుచేశారు. కేసీఆర్‌పై దుష్ప్రచారం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు మెరుగైన పాలన అందించడంలో విఫలమవుతున్నదని విమర్శించారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, తగిన సమయంలో రేవంత్ సర్కారుకు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.






Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.